క్లుప్తంగా

ఆర్థిక సాయం

మోతీనగర్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం మానవ ధర్మమని బీఆర్‌ఎస్ నాయకుడు మస్తాన్‌రెడ్డి అన్నారు. ఇటీవల తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు మల్లికార్జున చారి మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా వివేకానందనగర్ పార్టీ నాయకులు రూ.39వేలను సేకరించి గురువారం మల్కాజ్‌గిరిలో ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. మల్లికార్జునచారి కుటుంబసభ్యులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, సిమెంట్ రవి ముదిరాజ్, శ్రీశైలంయాదవ్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ దయార్‌గూడకు చెందిన మేకల శంకర్ ఆరోగ్య సమస్యతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఆర్థికంగా పేదవాడైన శంకర్ సీఎంఆర్ ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు అందజేశారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

మోతీనగర్: వివేకానందనగర్‌లోని శ్రీసాయి చైతన్య టెక్నో హైస్కూల్ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో కార్పొరేటర్ సబిహా బేగం పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు పాఠశాల ఉచితంగా విద్యను అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

మనం సైతం ఫౌండేషన్‌కు విరాళం



కూకట్‌పల్లి: తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ గొట్టిముక్కల పాండురంగారావు మనం సైతం ఫౌండేషన్‌కు విరాళం అందించడానికి ముందుకొచ్చారు. గురువారం మనం సైతం వ్యవస్థాపకుడు నటుడు, రచయిత, దర్శకుడు కాదంబరి కిరణ్‌కు రూ.30వేల చెక్కును అందజేశారు. గొట్టిముక్కల పాండురంగారావు మాట్లాడుతూ... తన మిత్రుడు కాదంబరి కిరణ్ ఫౌండేషన్ స్థాపించి సేవలు అందిస్తున్నందుకు సంతోషమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కిరణ్ మాట్లాడుతూ అంధుల కోసం పాండు రూ.30వేలు విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

నేటి నుంచి దివ్యాంగుల బస్‌పాస్‌ల మేళా

రాయదుర్గం: గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో దివ్యాంగుల సౌకర్యార్థం 'దివ్యాంగుల బస్‌పాస్‌ల స్పెషల్ మేళా'ను నిర్వహించడం జరుగుతుందని టీఎస్ ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కృష్ణకాంత్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాస్‌లు జారీ చేస్తారన్నారు. బస్‌పాస్ పొందటానికి పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్ కాపీ, ఆధార్‌కార్డు, ఐడీకార్డు తీసుకు రావాలని, సర్వీస్‌చార్జీ కిందరూ.50ల రుసుముతో సంప్రదించాలన్నారు. శుక్రవారం (10వ తేదీ) పటాన్‌చెరు బస్ పాస్ కేంద్రం, సోమవారం (13వ తేదీ) దిల్‌సుఖ్‌నగర్, బుధవారం (15వ తేదీ) ఇబ్రహీంపట్నం, శుక్రవారం(17వ తేదీ) మెహిదీపట్నం, సోమవారం (20)వ తేదీ సీబీఎస్‌లోని బస్‌పాస్ కేంద్రంలో మేళా జరుగుతుందన్నారు.

ఒప్పందం

మాదాపూర్: మాదాపూర్‌లోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ జనరల్ భిక్షపతి, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్‌కుమార్ పెద్దపల్లి, ఆర్జీయుకేటీ (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్) వీసీ వి.వెంకటరమణలు న్యాక్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో న్యాక్, ఆర్జీయూకేటీ సంయుక్తంగా ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలను వర్కింగ్ ఇంజనీర్స్‌కి నిర్వహించనున్నట్టు తెలిపారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, ప్లేస్‌మెంట్స్‌తో పాటు ఇంజనీరింగ్ విద్యార్థులకు మరిన్ని శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు.

దుమ్ము, ధూళితో కంటి సమస్యలు

- కంటి వెలుగు పరీక్షల్లో ఆసక్తికర విషయాలు
- బాలానగర్, ఫతేనగర్ డివిజన్ల ప్రజల కంటిచూపుపై తీవ్ర ప్రభావం
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు



బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రస్తుతం 9 కంటి వెలుగు కేంద్రాలు పని చేస్తున్నాయి. జనవరి నెల 19వ తేదీన కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభమైన విషయం విదితమే. ప్రత్యేకంగా బాలానగర్, ఫతేనగర్ డివిజన్‌లో పరిధిలో మిగతా డివిజన్ల ప్రజల కంటే ఎక్కువగా కంటి చూపుపై ప్రభావం చూపుతోంది.

స్క్రీనింగ్‌లో వెల్లడైన అంశాలను చూద్దాం..

- వైద్య పరిభాషలో టెరిజియం లేదా సర్ఫస్ ఐగా చెప్పే కంట్లోని కండరాల పెరుగుదల సమస్యకు కారణమవుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కేంద్రాల్లో స్క్రీనింగ్‌లో ఇవే అంశాలు వెల్లడయ్యాయి.
- 25 నుంచి 40 సంవత్సరాల వయస్సులో ఉన్న వారికి కంటి చూపు తగ్గుతోంది. చికిత్సను నిర్లక్ష్యం చేస్తే ఆ కండరాలు కార్నియాను పూర్తిగా కప్పేసి కంటిచూపును దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదని వైద్యులు చెబుతున్నారు.
- దుమ్ము, ధూళిలో తిరగడం, కళ్లద్దాలు, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించడం, హార్మోనల్ ఇన్ బ్యాలెన్స్, ఇన్‌ఫెక్షన్ల తదితర కారణాలు కంటి చూపును దెబ్బతీస్తున్నాయి.
- పారిశ్రామిక ప్రాంతం కావడంతో అనేక పరిశ్రమలు ఉన్నాయి. దానికి తోడు లారీలు, ఆటోలు ఎక్కువగా తిరగటం, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం, దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండటంతో ఇక్కడి ప్రజల కంటిచూపుపై ప్రభావం పడుతోంది.

10560 మందికి కంటి సమస్యలు...

కంటి వెలుగు కేంద్రాల్లో 32 రోజుల్లో 9 కేంద్రాల్లో 46 వేల 940 కుటుంబాలకు స్లిప్పులు ఇంటింటికీ పంచగా 32 వేల 254 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 40 సంవత్సరాలలోపే వయస్సు ఉన్న వారు 12605 మందికి కంటి పరీక్షలు చేయగా అందులో 10 వేల మందికి పైగా కంటిచూపు తగ్గుతోంది. ప్రత్యేక అద్దాల కోసం 2870 మందికి ఆర్డర్ చేశారు. త్వరలోనే వాటిని అందజేస్తారు. 3866 మందిని వివిధ ఆసుపత్రులకు కంటి చికిత్సల కోసం రిఫర్ చేశారు.

- కంటి జబ్బులు నిర్ధారణ అయిన బాధితుల్లో 0.5 శాతం మంది కంట్లో కండరాల సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కార్నియాపై తెల్లని కండరాలు పేరుకుపోవంతో కంటి చూపు దెబ్బ తింటోంది. ఈ సర్ఫస్ ఐ బాధితుల్లో దుమ్ము, ధూళి కణాలు ఎక్కువగా రద్దీ ప్రాంతాల్లో నివసించే, పని చేసే, ప్రయాణించే వారే ఎక్కువగా ఉండటం విశేషం. వైద్యులు వీరికి తగు సూచనలు, సలహాలు చేశారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జాగ్రత్తలు పాటించాలి



వెల్డింగ్, సిమెంట్ పని చేసే కార్మికులు, ప్లాస్టిక్ కంపెనీలు, ఇతర కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలి. కంటో దుమ్ము, ధూళి, బూడిద పడకుండా చూసుకోవాలి. కంటినిండా నిద్రపోవాలి. చన్నీళ్లతో కళ్లను శుభ్రం చేసుకోవాలి.

– డాక్టర్ చందర్, బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



గాయత్రినగర్‌లో...



హరినగర్‌లో..



రాధాకృష్ణ నగర్‌లో ఇళ్ల మధ్యన

చేతి పంపులు ఇలా..!

అందుబాటులో లేక జనం బేజార్

మోతీనగర్: మూసాపేట, అల్లాపూర్ డివిజన్లలో గతంలో ప్రజల అవసరాలకు ఏర్పాటు చేసిన చేతి పంపులు పాడైపోయి దర్శనమిస్తున్నాయి. బస్తీ, కాలనీవాసుల అవసరాలను తీర్చిన చేతి పంపులు నేడు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా చేతి పంపులకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

- మూసాపేట డివిజన్ పాండురంగానగర్ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆనుకొని చేతి పంపు ఉండేది. అది కొన్ని సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉంది. దానికి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. నిత్యం ఉదయం నుంచే నిర్వహించే పలు పూజా కార్యక్రమాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తూంటారు. వారందరు ఈ బోరు పంపు నుంచి నీటిని వాడుకునేవారు. ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది.
- అల్లాపూర్ డివిజన్‌లోని రాధాకృష్ణనగర్‌లో ఇళ్ల మధ్య చేతి పంపు ఎంతగానో ఉపయోగపడేది. కానీ అది నేడు రోడ్డు మధ్యలో వాహనాలు, పాదాచారులకు అడ్డుగా ఉంది.



పాండురంగానగర్ శ్రీప్రసన్నఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిరుపయోగంగా చేతి పంపు

- రాజీవ్‌గాంధీ నగర్, సఫ్దారనగర్, పర్వత్‌నగర్, తులసీనగర్, కబీర్‌నగర్, బబ్బుగూడలతో పాటు పలు బస్తీలు, కాలనీలలో చేతి పంపులు గతంలో విరివిగా ఉండేవి. అవి నేడు పని చేయక అరుదుగా దర్శనమిస్తున్నాయి. కొన్నిటిని అధికారులే తొలగించారని స్థానికులు తెలుపుతున్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాల్లో భాగంగా హైదర్‌నగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు క్షత్రియ యూత్ ఫెడరేషన్ పరీక్ష కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు గురువారం టెన్త్ విద్యార్థులకు కిట్లను అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఆయన ఆకాంక్షించారు. ఉన్నత చదువులు చదవి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కుమారస్వామి, దానయ్య, అనిల్, జుబేదా, క్షత్రియ యూత్ నాయకులు సుధీర్ వర్మ, రాంబాబు రాజు, కృష్ణంరాజు, నరసింహ రాజు, కిరణ్, బుచ్చిరాజు, శ్రీపతి, వినయ్‌వర్మ, సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ మేళాలో ఆస్తిపన్ను సమస్యలను పరిష్కరించుకోండి



సుభాష్‌నగర్: రెవెన్యూ మేళాలో దరఖాస్తు చేసుకుంటే ఆస్తిపన్ను సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో రెవెన్యూ మేళా ఉంటుందన్నారు. ఆస్తిపన్ను విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే రెవెన్యూ మేళాలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే విధంగా మార్చి 31 వరకు బిల్‌కలెక్టర్లు అందరూ ఉదయం 8గంటల వరకు పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ఆన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్ 100శాతం పూర్తి చేయాలన్నారు. వ్యాపారం నిర్వహించే దుకాణాదారులు అందరు తప్పనిసరిగా ట్రేడ్‌లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారి శ్రీహరి, రాజు, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

కొరియా వర్సిటీతో గీతం ఒప్పందం



సమావేశమైన విశ్వవిద్యాలయాల సభ్యులు

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, కొరియాలోని చియోంగ్జు విశ్వవిద్యాలయంతో గురువారం రెండు అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నట్టు యూనివర్సిటీ బాధ్యులు తెలిపారు. ఐదేళ్ల పాటు అమలులో ఉండే ఒప్పందాలపై గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, టెక్నాలజీ అసోసియేట్ డెరైక్టర్ ప్రొఫెసర్ ఎస్.సీతారామయ్య, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాస్, చియోంగ్జు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ యోంగ్ జిన్ చుంగ్లు సంతకాలు చేశారు. పరస్పరం ఆసక్తి ఉన్న సమాచారం-పదార్థాల మార్పిడి, అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్, పరిశోధన సిబ్బందిని పరస్పరం మార్పిడికి అంగీకరించాయి. విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లతో పాటు విమాన- సాంకేతిక సమాచారం పరస్పరం ప్రోత్సహించుకునేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. అనంతరం గీతంలో చేపట్టిన పరిశోధనల పురోగతిపై విద్యార్థులతో కొరియా బృందం ముఖాముఖి నిర్వహించారు.

వేడుకగా ప్రమాణ స్వీకారోత్సవం



నూతన పాలక మండలి సభ్యులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీలక్ష్మీగణపతిస్వామి దేవాలయంలో నూతన పాలక మండలి సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్ ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, అధ్యక్షుడు సత్యనారాయణ రాజు, వైస్ ప్రెసిడెంట్‌లు రమణారావు, శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ ప్రదీప్‌రాజ్, జాయింట్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ తుల్జా గణేష్, ట్రెజరర్ సుబ్రమణ్యం ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు శుభాకాంక్షలు





రాష్ట్ర శాసనమండలికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్న సందర్భంగా దేశపతి శ్రీనివాస్, కుర్మయ్యగారి నవీన్‌కుమార్, చల్లా వెంకట్రామిరెడ్డిలను అసెంబ్లీ ఆవరణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కలిశారు. మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు ఎమ్మెల్సీ అభ్యర్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– కూకట్‌పల్లి

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాకు చెందిన మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఓపీవోలు తమ విధులను జాగ్రత్తగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహించరాదని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. ఈనెల 13న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా పరిషత్ సీఈవో దేవ సహాయంలతో కలిసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, ఏఆర్వో నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు ఎన్నికల కమిషన్ నుంచి ఎప్పటికప్పుడు వచ్చే ఆదేశాలను క్షుణ్ణంగా చదవాలని ఆదేశించారు. ఏదైనా కారణాలతో ప్రిసైడింగ్ అధికారి ఎన్నికలు నిర్వహించలేకపోతే అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి కూడా ఎన్నికలు నిర్వహించే విధంగా సంసిద్ధంగా ఉండాలని నర్సింహారెడ్డి సూచించారు.

16 నుంచి డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాప్

రాయదుర్గం: మనూలోని బోధన మీడియా సెంటర్(ఐఎంసీ) ఆధ్వర్యంలో ఇండియన్ డాక్యుమెంటరీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐడీపీఏ) ముంబాయి సహకారంతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రొఫెషనల్స్, ఇతరులకు డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్‌పై ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజులపాటు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు పేర్ల రిజిస్ట్రేషన్‌ను మార్చి 12వ తేదీ వరకు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు నిర్మాత, వర్క్‌షాప్ కన్వీనర్ మహ్మద్ ముజాహిద్‌ను ఫోన్ నెంబర్ 9885389140లో సంప్రదించాలన్నారు.

బీహెచ్‌ఈఎల్‌లో మాక్ డ్రిల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో సీఐఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. విపత్తులు, అగ్ని ప్రమాదాలు, ఉగ్ర దాడుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సీఐఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కార్మికులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భెల్ జీఎం శ్యామ్ బాబు, జీఎం హెచ్‌ఆర్ మగేంద్రవర్మన్, అగ్నిమాపక ఇన్‌చార్జ్ కృష్ణారావు పాల్గొన్నారు.

యూఎల్‌సీ ప్రభుత్వ భూములు అమ్ముకోలేదా?

బీజేపీ నేతలపై కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ఫైర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై కూకట్‌పల్లి బీజేపీ నాయకుడు మాధవరం కాంతారావు చేసిన ఆరోపణలపై కూకట్‌పల్లి బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గురువారం ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూకట్‌పల్లి బీజేపీ నాయకుల తీరు ×నవ్వి పోదురు గాక నాకేంటి సిగ్గు×అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. కనీసం వార్డు సభ్యులుగా కూడా గెలవని వారు... రెండు సార్లు పోటీ చేసినా డిపాజిట్ కూడా దక్కని కాంతారావు ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రెండుమార్లు ప్రజల మన్ననలు పొంది అఖండ మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే కృష్ణారావు ఎక్కడా? దిక్కూ దివానం లేని మీరు, మీ నాయకుడెక్కడ అని ప్రశ్నించారు.

- అన్ని అక్రమాల్లో మీరే ఉన్నారని.. అయినా సిగ్గు లేకుండా అధికార పార్టీపై నిందలు ఆరోపణలు వేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. అధికార పార్టీపై ప్రెస్‌మీట్ పెట్టి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు అంటూ ఆధారం లేని ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రెస్‌మీట్ పేరుతో కూర్చున్న నలుగురిలో ముగ్గురి బాగోతాలు కూకట్‌పల్లి ప్రజలకు ఎప్పుడో తెలుసన్నారు.

మీరు కూర్చొంటున్న బీజేపీ కార్యాలయం కబ్జాకాదా..?

- కూకట్‌పల్లి చరిత్రకు అద్దం పట్టే కమాన్‌ను చెరపట్టి మీ అడ్డాగా మార్చుకోవటం నిజం కాదా అని ప్రశ్నించారు. ఊరిలోకి ప్రతి రోజు వచ్చి వెళ్లే వేలాది వాహనాలకు అనువైన ఒక వైపు రోడ్డును దేవుడి పేరుతో పూర్తిగా మూసివేసింది మీరు కాదా? అని అన్నారు. ఇక చెరువుల, అక్రమ నిర్మాణాలు ప్రభుత్వ భూముల కబ్జా విషయం మీరు మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. అధికార పార్టీపై ఆరోపణలు చేస్తున్న మీరు ముందుగా మీ అంతరాత్మ సాక్షిగా ఆరోపణలు చేయాలన్నారు.
- నల్ల చెరువు శిఖం (సర్వే నం.39, 42, 43, 44, 66, 69, 70) భూములను, ప్రభుత్వ యూఎల్సీ భూములను పట్టాభూముల పేరుతో విక్రయించింది మీరు కదా అని ప్రశ్నించారు. గుడుల పేరుతో ప్రభుత్వ భూములను అమ్ముకుని బడుల పేరుతో చెరువు భూములను చెరపట్టారని విమర్శించారు.
- నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ మా ఎమ్మెల్యే ముందుకు వెళ్తున్నారని అన్నారు. ప్రజలు బీజేపీకి తగిన సమయంలో తగిన బుద్ధి చెప్పటం ఖాయమన్నారు.

నేడు భవిష్య నిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో భవిష్య నిధి అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ హేమంత్ తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 10గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లో రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు సూచనలు స్వీకరిస్తామని అన్నారు. కూకట్‌పల్లి మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈయల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చునని తెలిపారు.

ముకుంద జ్యువెలరీ ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ముకుందా జ్యువెలరీ నిర్వాహకులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని రోడ్డు నం.4లో ముకుంద జ్యువెలరీ షోరూంను సంస్థ నిర్వాహకులు కృష్ణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణాలోనే మొట్టమొదటి అతి పెద్ద ఫ్యాక్టరీ అవుట్‌లెట్ అయిన ముకుంద జువెలరీని ప్రారంభించటం చాలా ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్ ప్రజలకు ఇప్పటి నుంచి తక్కువ ధరలకు, తక్కువ తరుగుతో బంగారు ఆభరణాలు కష్టమర్లకు అందిస్తామన్నారు. ముకుంద జ్యువెలరీ షోరూం సువిశాలంగా, షాపింగ్ చేసే వారికి అత్యాధునికంగా అంతర్జాతీయ షాపింగ్ అనుభూతి లభిస్తుందన్నారు. కస్టమర్లకు ఇష్టమైన అనేక వెరైటీలు అందుబాటులో ఉంచామని తక్కువ తరుగుతో అనుకూలమైన ధరల్లో జ్యువెలరీ లభిస్తాయని సంస్థ ప్రతినిధి కృష్ణ తెలిపారు.

100శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి
- పదో తరగతి పరీక్ష సన్నద్ధతపై ఉపాధ్యాయులతో సమీక్ష
- సీ-గ్రేడ్ వచ్చిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని ఆదేశం

కూకట్‌పల్లి: పదో తరగతి వార్షిక పరీక్ష సన్నద్ధతపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి గురువారం సమీక్షా సమావేశాన్ని కూకట్‌పల్లిలోని పీఎస్‌ఎం పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత, భౌతిక శాస్త్రం, జీవశాస్త్ర ఉపాధ్యాయులతో రెండు రోజుల పాటు సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా పదో తరగతి ప్రీ ఫైనల్‌లో ఫలితాలు వారీగా ఒకొక్క ప్రధానోపాధ్యాయుడితో సమావేశమయ్యారు.

– తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన పాఠశాల ప్రధానోపాధ్యాయులను అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకునరారు. సీ-గ్రేడ్ విద్యార్థులకు 30 రోజుల పాటు ప్రత్యేక శ్రద్ధను వహించి జిల్లాలో అన్ని పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత వచ్చే విధంగా ప్రతి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆదేశించారు.

– అదే విధంగా ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేకంగా చేపడుతున్న తొలి మెట్టు, మన ఊరు - మన బడి, పాఠశాల బయట పిల్లల సర్వే పలు అంశాలను కూడా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షల విభాగం, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ విజయకుమారి



సమీక్షలో పాల్గొన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు